వెనామీకి నెలవు నక్కల కాలువ

- రెండు మండలాలకు మేలు
- కాలువ అంచున వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు


మేజర్ డ్రెయిన్ నక్కల కాలువ

ముత్తుకూరు : ముత్తుకూరు–వెంకటాచలం మధ్య ప్రవహించే మేజర్ డ్రెయిన్ నక్కలకాలువ అంచులు వెనామీ రొయ్యల పెంపకానికి నెలవుగా మారాయి. కాలువకు ఇరువైపులా వేలాది ఎకరాల్లో రైతులు వెనామీ రొయ్యల పెంపకానికి అలవాటు పడిపోయారు. ముత్తుకూరు మండలంలోని పంటపాళెం, పోలంరాజుగుంట, పొట్టెంపాడు, వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం, తిరుమలమ్మ పాళెం ద్వారా ప్రవహించే ఈ కాలువ ముంపు జలాలను ఉప్పుటేరుకు తరలించడమే కాకుండా ఏళ్ల తరబడి వెనామీ పెంపకానికి కేంద్ర బిందువుగా నిలిచింది. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా రైతులు రూ.కోట్ల పెట్టుబడులతో రొయ్యల పెంపకం సాగిస్తున్నారు. వచ్చే జనవరి నుంచి మొదలయ్యే పెంపకానికి చెరువులను సిద్ధం చేస్తున్నారు. చెరువుల్లో సీడ్ (రొయ్య విత్తనం) విడిచిపెట్టే ప్రక్రియ చేపట్టారు. నక్కలకాలువ అంచున వేసే ఫిల్టర్ పాయింట్ల నీటితో రొయ్యల పెంపకం విజయవంతం అవుతుందన్న నమ్మకమే రైతుల్లో దృఢంగా ఉంది.

నక్కల కాలువ ప్రత్యేకత

నక్కలకాలువకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ కాలువ అంచున ఏర్పాటు చేసే డీప్ బోర్ల ద్వారా వెనామీ సాగుకు అనుకూలమైన 5 నుంచి 10 పీపీటీకి పైగా సెలెనిటీ(లవణ శాతం) నీరు లభిస్తోంది. ఒక సారి నష్టాలు వస్తాయి, మరో మారు పెట్టుబడులు మాత్రమే వస్తాయి. అయినప్పటికీ మరుసటి పెంపకంలో లాభాలు గ్యారెంటీ అనేది రైతుల విశ్వాసం. కనుకనే నక్కలకాలువకు ఇరువైపులా రొయ్యలపెంపకానికి అనుకూలమైన భూముల లీజు గ్రామాలను బట్టి ఒక ఎకరా (ఒక సంవత్సరానికి) రూ.30,000 నుంచి రూ.50,000లు పలుకుతోంది. అక్కడక్కడా ఈ కాలువ ఒడ్డున వరి సేద్యం జరుగుతున్నప్పటికీ రొయ్యల సాగు 90 శాతం జరుగుతోంది.

రొయ్యలకు చాలా అనుకూలం



మేజర్ డ్రెయిన్ నక్కల కాలువకు అటూ ఇటూ ఉన్న భూములు వెనామీ రొయ్యల పెంపకానికి అనువుగా ఉన్నాయి. ఈ సంవత్సరం రొయ్యల పెంపకం సంతృప్తిగానే కొనసాగింది. ఇక్కడి నీటిలో సెలెనిటీ రొయ్యల పెంపకానికి అనువుగా ఉండడమే దీనికి కారణం.

– పల్లంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, పొట్టెంపాడు

ధరలు ఆశా జనకంగా ఉండాలి



నక్కలకాలువ ఒడ్డున రొయ్యల పెంపకం ఈ సంవత్సరం ఆశాజనకంగా జరగలేదు. సొంత భూములు అయినప్పటికీ విడిచిపెట్టకుండా రొయ్యల పెంపకం సాగిస్తున్నాం. కష్టపడి పెంపకం చేసినప్పటికీ ధరలు ఆశా జనకంగా ఉండాలి.

– దువ్వూరు కోదండరామరెడ్డి, పోలంరాజుగుంట


కాలువ అంచున వెనామీ రొయ్యల గుంతలు


కాలువ అంచున వేసిన ఫిల్టర్ పాయింట్లు

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు


ప్రత్యేక పూజల్లో భక్తులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గోవిందనామస్మరణతో దేవస్థానం మార్మోగింది.

అంకమ్మ తల్లికి విశేష అభిషేకాలు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

విడవలూరు : విడవలూరు గ్రామ దేవత అంకమ్మ తల్లికి స్థానికులు ఆదివారం విశేష పూజలు చేసి అభిషేకాలు గావించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కొర్నా గిరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులే ఉభయకర్తలుగా వ్యవహరించారు.

‘అమరావతి’లో పేరెంట్స్ ఓరియంటేషన్



పొదలకూరు : పట్టణంలోని అమరావతి స్కూల్లో పేరెంట్స్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ఆదివారం నిర్వహించారు. పిల్లలపై తల్లిదండ్రుల ప్రవర్తన, నడవడిక చూపే ప్రభావం గురించి వివరించారు. కరస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడుతూ ఆచరణాత్మకమైన కార్యక్రమాలను వినూత్నంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోవూరులో జిల్లా కబడ్డీ జట్టుకు శిక్షణ


శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

కోవూరు : జిల్లా బాలుర కబడ్డీ జట్టుకు కోవూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శిక్షణా శిబిరం కొనసాగుతోంది. వీరు వచ్చే జనవరి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో జరిగే అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు.

ఎడ్ల బండి పోటీల్లో తృతీయ స్థానం


బైక్‌ను అందుకుంటున్న విజేత జనార్దన్‌రెడ్డి

ఇందుకూరుపేట : తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎండ్ల బండి పోటీల్లో మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన పంబాల జనార్దన్‌రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. దీంతో విజేతకు నగదు బహుమతితో పాటు బైక్‌ను నిర్వాహకులు అందజేశారు.

సత్కారం



బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్ విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ‘రేపటి తరం కోసం మార్పు’ అనే అంశంపై ఆదివారం ప్రసంగించారు. దీంతో ఆయన్ను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సత్కరించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక మఠం కాలనీలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నిమ్మల నాగార్జున యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వంశీ, లక్ష్మణరావు, నిమ్మల అనూష, నిమ్మల రాధా పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



కోవూరు : మండలంలోని పెద్ద పడుగుపాడు, ఎన్టీఆర్ మిక్స్‌డ్ కాలనీ వద్ద ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం మెరుపు దాడులు చేశారు. సీఐ వి.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై వై.రంగనాథ్‌గౌడ్ వారి సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,72,580 నగదు, ఓ కారు, నాలుగు మోటార్ బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కోడి పందేల స్థావరంపై..

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట సమీపంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.2,140 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం నాయకులు

ముత్తుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు షేక్ షాన్‌వాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా డిమాండ్ చేశారు. ముత్తుకూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించిందని, ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీరిని వీధిన పడేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెంటనే వీరిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలన్నారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడం అమానవీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ సర్వేపల్లి కార్యదర్శి కొమారి నందయ్య, మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు, ఏఐవైఎఫ్‌ఐ కన్వీనర్ షేక్ అన్సర్, ముజీబ్‌బాషా పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేటలో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఆదివారం తెలిపిన సమాచారం మేరకు.. ఇందుకూరుపేటకు చెందిన వంశీ ఐదు రోజుల క్రితం స్నేహితుల వద్ద కొరుటూరుకు చెందిన తుమ్మల జశ్వంత్‌ను డాన్ అని పిలుస్తూ ఆరాతీశారు. ఈ విషయం జశ్వంత్‌కు తెలియడంతో నెల్లూరుకు చెందిన యుగంధర్, సాయితేజతో కలిసి ఇందుకూరుపేటలో శనివారం వంశీని కలిసి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కత్తితో వంశీపై దాడి చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. సీఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఇందుకూరుపేటకు వచ్చి ఘటనపై ఆరాతీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి వివరించారు.

కృష్ణారెడ్డికి కాకాణి పరామర్శ


ప్రభావతమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కాకాణి

తోటపల్లిగూడూరు : మండలంలోని వరకవిపూడి పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కూరపాటి కృష్ణారెడ్డి, ఆయన కుటుంబసభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కృష్ణారెడ్డి సతీమణి కూరపాటి ప్రభావతమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఈ క్రమంలో ఆదివారం వరకవిపూడి గ్రామంలోని కృష్ణారెడ్డి నివాసంలో ప్రభావతమ్మ భౌతికకాయానికి కాకాణి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ నేతలు ఇసనాక రమేష్‌రెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్ ఉన్నారు.

విద్యార్థులకు బాలచిత్ర కళాశ్రీ అవార్డులు


అవార్డులతో విద్యార్థులు

పొదలకూరు : నెల్లూరు అమీర్ ఆర్ట్స్ అకాడమీ వారు ఇటీవల నిర్వహించిన తొమ్మిదో జాతీయ స్థాయి బాలల చిత్రకళా పోటీల్లో నాగార్జున స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది బాల చిత్ర కళాశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. నెల్లూరు టౌన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రకారులు అమీర్, షేక్ అబ్దుల్లా చేతుల మీదుగా విద్యార్థులు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలను ఆదివారం అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్ ఎ.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతి విద్యార్థులకు..

పట్టణంలోని అమరావతి స్కూల్ విద్యార్థులు 30 మందికి అమీర్ ఆర్ట్స్ అకాడమీ వారు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలను అందజేసినట్టు కరస్పాండెంట్ కె.సురేష్ వెల్లడించారు.

ఎస్సీ హాస్టల్ నిర్వహణపై డీడీ ఆగ్రహం


హాస్టల్ నిర్వహణపై ఆరాతీస్తున్న డీడీ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది వద్ద దుర్వాసన, తాగునీటి పైప్‌లైన్ నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం హాస్టల్‌ను శుభ్రంగా ఉంచుకోరా.. అన్ని ప్రశ్నించారు. సాయంత్రంలోగా మొత్తం క్లీన్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసేందుకు మోటివేట్ క్లాసులను ఏర్పాటు చేస్తామన్నారు. హాస్టల్ మరమ్మతులకు ఇప్పటికే రూ.22 లక్షలు మంజూరైందని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు.

కోడూరు తీరంలో కోలాహలం


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

తోటపల్లిగూడూరు : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో కోలాహలంగా మారింది. పిల్లలు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బీచ్ పరిసరాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల తాకిడి సాయంత్రం వరకు కొనసాగింది.

నరకానికి నకళ్లు.. గ్రామీణ రోడ్లు


గుంతల రోడ్డులో నిలిచిన వర్షపునీరు


అధ్వానంగా మారిన కోడూరు బీచ్ రోడ్డు

తోటపల్లిగూడూరు : రహదారుల నిర్మాణాలు, మరమ్మతులకు రూ.కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పుకొంటున్న కూటమి నేతలు.. క్షేత్రస్థాయిలో అమలు మాత్రం కనబడటం లేదు. దీంతో గ్రామీణ రహదారులు నరకానికి నకళ్లుగా మారింది. మండలంలోని తీరప్రాంతాలైన వెంకన్నపాళెం, కొత్తపాళెం, పోట్లపూడి, కోడూరు, మాచర్లవారిపాళెం గ్రామాల్లోని పంచాయతీరాజ్‌శాఖ రహదారులు అస్తవ్యస్తంగా మారిపోయాయి. దుస్థితిలో ఉన్న రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు రూపురేఖలను కోల్పోయాయి. ముఖ్యంగా వరకవిపూడి నుంచి అనంతపురం వరకు ఉన్న తారురోడ్డు గుల్లగుల్లగా తయారైంది. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేటు వాహనాలు, ఆటోలు ఆయా మార్గాల్లో ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది. సీఎస్‌పురం నుంచి గొల్లపాళెం వెళ్లే రహదారి గుల్లగుల్లగా మారడంతో స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే నరుకూరు–కోడూరు మార్గంలో విలుకానుపల్లి సమీపంలో ఇటీవల నిర్మించిన బీటీరోడ్డు రూపు కోల్పోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మహాలక్ష్మీపురం నుంచి కోడూరు బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుల్లగుల్లగా మారడంతో బీచ్ సందర్శకులతో పాటు ఇతర ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు.


నరుకూరు-కోడూరు ప్రధాన రహదారి దుస్థితి


అస్తవ్యస్తంగా కోడూరు-ఈదూరు రోడ్డు

భారీ వాహనాలతో రోడ్లు గుల్ల


పంటపాళెం వద్ద..

ముత్తుకూరు : నిత్యం భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల ముత్తుకూరు–పంటపాళెం రోడ్డు ఛిన్నాభిన్నమైంది. సామర్థ్యానికి మించి ఇసుక, గ్రావెల్ మోసుకెళ్లే లారీలు, టిప్పర్లు, బూడిద తరలించే బలకర్లు నిరంతరం ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల రోడ్లతో పాటు సుబ్బారెడ్డిపాళెం బ్రిడ్జిపై కూడా గుంతలు పడుతున్నాయి. మూడు మాసాల క్రితం మొదలైన చిన్న గుంతలు ఇప్పుడు గొయ్యిలను తలపిస్తున్నాయి. రాత్రి వేళ ద్విచక్రవాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ గుంతలకు తాత్కాలిక రిపేర్లు చేయాల్సి ఉంది.


సుబ్బారెడ్డిపాళెం వద్ద..